క్లుప్తంగా

బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం



బీచ్ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

కొత్తపల్లి: ఉప్పాడ తీర ప్రాంతం సోమవారం పర్యాటకులతో కళకళలాడింది. కొత్తపల్లి మండలంతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్ల ప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడం వల్ల కాకినాడ–ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక ఎస్సై రామలింగేశ్వరరావు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

స్పందనకు ఎనిమిది అర్జీలు



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న ట్రైనీ కలెక్టర్ ప్రఖర్ జైన్, ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: డివిజన్ స్థాయి స్పందనకు సోమవారం ఎనిమిది అర్జీలు వచ్చినట్టు ఆర్డీఓ జేఎస్ రామారావు తెలిపారు. ట్రైనీ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌తో కలసి నిర్వహించిన గ్రీవెన్స్‌కు ఆక్రమణలు తొలగించాలని, గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని తదితర సమస్యలపై అర్జీలు వచ్చినట్టు ఆర్డీఓ తెలిపారు. తాము అందుకున్న అర్జీలను సంబంధిత శాఖలకు పరిష్కారం నిమిత్తం పంపినట్టు ఆయన తెలిపారు. డీఎల్‌పీఓ బాలామణి, ఆర్డీఓ కార్యాలయ డీటీ భానుకుమార్, మున్సిపల్ మేనేజర్ జ్యోతి రాణి, ఏడీఏ దైవకుమార్, రవిశంకర్, ప్రసాద్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు కిటకిటలాడారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అర్చకులు తొలి పూజ చేశారు. తరువాత భక్తుల అభిషేకాలను స్వామి వారికి చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వర రావు, ట్రస్టు బోర్డు సభ్యులు, దేవదాయశాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు. ఉప ఆలయాల్లోనూ అర్చకులు పూజలు చేశారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

పిఠాపురం: పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మున్సిపల్ శానిటేషన్ వర్కర్స్ సంఘం నాయకులు నీలాపు ఏసమ్మ, సీహెచ్‌వీ రమణ మాట్లాడుతూ ఈ నెల 20న మహిళలు, 21న పురుషులు విధులకు హాజరు కారని తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ వర్కర్స్ సంఘం నాయకులు సింగంపల్లి రాజు, బి.సత్యవతి, ఎ.రాజు, మరిడియ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌కు కృషి చేయాలి

పెద్దాపురం: గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ అశోక్‌కుమార్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్వచ్ఛ సర్వేక్షణ్‌పై కార్యాలయ పరిపాలనాధికారి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గతంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ఎంపికైన చదలాడ, , కొండపల్లి, జి.రాగంపేట, కాండ్రకోట గ్రామాలతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటిస్తుందన్నారు. గ్రామాల అభివృద్ధిని చూపించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. పారిశుధ్యం, తాగునీటి వసతి, సంపద తయారీ కేంద్రం నిర్వహణ, ప్రభుత్వ భవనాల నిర్మాణం తదితర అన్ని అంశాలపై ఆ బృందం పరిశీలిస్తుందని వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అప్పలరాజు, ట్రైనీ కార్యదర్శి ఈశ్వరరావు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జరిమానా

సామర్లకోట: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో ఇద్దరికి కోర్టు రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్టు సీఐ కె.దుర్గాప్రసాద్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకుని సోమవారం కాకినాడ కోర్టుకు హాజరుపరచగా జగ్గంపేటకు చెందిన క్రాంతి నాగేంద్ర, నందిగామకు చెందిన నరసింహరావులకు జరిమానా విధించినట్టు తెలిపారు.

తూటేరు పూడికకు మోక్షం

- ఫలించనున్న వీకే రాయపురం రైతుల పోరాటం
- ముంపు సమస్యకు తెర పడినట్టే

సామర్లకోట: తూటేరు పూడికకు మోక్షం కలగనుంది. మండలంలోని వీకే రాయపురం, బోయనపూడి రైతులకు ఈ డ్రైను శాపంగా మారింది. ఎనిమిదేళ్లుగా పూడిక తీయకపోవడంతో ఈ డ్రైను కింద సాగయ్యే సుమారు 800 ఎకరాలు తరచూ ముంపునకు గురవుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో రైతులు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాను కలసి వారి సమస్య వివరించడంతో ఆమె సామర్లకోట ఎంపీడీఓను పిలచి అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఆమె సుమారు వంద గంటలు జేసీబీతో పూడిక తీత, గుర్రపు డెక్క తొలగించాలని, ఇందుకు రూ.1.95 లక్షలు ఖర్చవుతుందని కలెక్టర్‌కు నివేదించారు. నివేదికను అనుసరించి నిధులు మంజూరు కావడంతో సోమవారం ఎంపీడీఓ సోమవారం రైతులతో సమావేశం నిర్వహించి రైతు సంఘాల నాయకుల పర్యవేక్షణలో పూడిక తీయించుకోవాలని సూచించారు.



చెరువును తలపిస్తున్న వీకే రాయపురం పొలాలు



రైతులతో సమావేశం ఏర్పాటు చేసిన ఎంపీడీఓ

వెదజల్లు పద్ధతితో సమయం ఆదా

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో నీరు ఆలస్యంగా రావడంతో నాట్లు జాప్యమయ్యాయి. వీకే రాయపురం రైతులు వెదజల్లు పద్ధతిలో నాట్లు వేసి నెలాఖరుకు పూర్తిచేయాలి. తూటేరు డ్రైనులో పూడిక తొలగిస్తే పొలాల్లో ముంపునీరు దిగి సమస్య తీరుతుంది.

– ఐ.సత్య, ఎంఏఓ, సామర్లకోట

నేటి నుంచి పూడికతీత పనులు

తూటేరు డ్రైను పూడికతీతకు అవసరమైన నిధులను మంజూరు చేశారు. మంగళవారం నుంచి పనులు ప్రారంభం అవుతాయి. రెండు పెద్ద జేసీబీలతో పది గంటలు పని చేయాల్సి ఉంటుంది.

– డి.శ్రీలలిత, ఎంపీడీఓ, సామర్లకోట

జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకుందాం

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలోని 19, 20, 21 వార్డుల పరిధిలో స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా హాజరై దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మేలైన పాలన అందిస్తున్న జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని అన్నారు. 1985 తరువాత మొదటిసారిగా సామర్లకోటకు చెందిన తనకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశాన్ని జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని, తనను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షత వహించగా వైస్‌చైర్మన్లు ఊబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రాదేవి, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, జగనన్న సురక్ష పట్టణ కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో..

మండల పరిధిలో అచ్చంపేట గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సోమవారం 339 సర్టిఫికేట్లు అందజేసిన్నట్లు తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి తెలిపారు. సర్పంచ్ వీరంరెడ్డి చినబాబు అధ్యక్షత వహించగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్ని జగనన్న సురక్ష ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్, ఎంపీడీఓ డి శ్రీలలిత, ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోటలో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న హౌసింగ్ చైర్మన్ దవులూరి

కాండ్రకోటలో..

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోటలో సర్పంచ్ ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన జగనన్న సురక్ష శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా ఈ కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తుదారులకు అవసరమైన ధ్రువపత్రాలను అందజేశారు. తహసీల్దార్ జితేంద్ర, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఈఓ పీఆర్డీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'సురక్ష'తో అర్హులందరికీ పథకాలు

కొత్తపల్లి: గ్రామాల్లోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని సర్పంచులు పెనుమల్లు వెంకటకుమారి, పులి జయబాబు అన్నారు. మండలంలోని కొత్తమూలపేట గ్రామ సచివాలయం వద్ద కొత్తమూలపేట, అమరవల్లి గ్రామాలకు సంబంధించి సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం పరిధిలోని 410 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వడి నాగమణి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి సుబ్బారావు, మండల ప్రత్యేకాధికారి పుష్పామణి, ఎంపీడీఓ అబ్రహం లింకన్, తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్, ఈఓపీఆర్డీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి వ్యర్థాలపై నిరసన



పవర కార్పొరేట్ ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

సామర్లకోట: పవర గ్రామంలోని కార్పొరేట్ ఆస్పత్రికి చెందిన వ్యర్థాలు సమీప ప్రజల ఆరోగ్యానికి చేటు తెస్తోందని ఆ గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఆస్పత్రి వద్ద గ్రామ ప్రజలు ఆందోళన నిర్వహించారు. పంచాయతీ శానిటరీ వర్కర్లు, గుమస్తాలను మచ్చిక చేసుకొని పంచాయతీ రిక్షా ద్వారా మెడికల్ వేస్టేజీను గ్రామంలో వేస్తున్నారని పిట్టా ప్రభాకర్, కాకర్ల నరస్సయ్య, బొంగులూరి శ్రీను, పిల్లి రాజ్‌కుమార్ తెలిపారు. ఈ వ్యవహారాలపై విచారణ జరపాలని, ఆస్పత్రి భవన నిర్మాణం అనుమతులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా ఆస్పత్రిలోని మెడికల్ వేస్టేజీకు సంబంధించి ఆస్పత్రి ఆవరణలోనే ప్రత్యేకంగా ప్లాంటు ఏర్పాటుచేసుకోవాలని ఆదేశాలిస్తామని, పంచాయతీ పారిశుధ్య సిబ్బంది ఆస్పత్రి నుంచి వ్యర్థాలు తీసుకుండా ఆదేశాలు జారీ చేస్తామని ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి తోట సత్యనారాయణ తెలిపారు.

ఉత్సాహంగా మడుగులమ్మ జాతర



జాతరలో డప్పుల డాన్సు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం సమీపంలో కొలువైన మడుగులమ్మ జాతర ఉత్సాహంగా జరిగింది. ఈ నెల 12న ప్రారంభమైన ఉత్సవాలల్లో భాగంగా సోమవారం అమావాస్యను పురస్కరించుకుని రైతు సంఘం ఆధ్వర్యంలో జాతర ఉత్సవం జరిగింది. భారీ బాణసంచా నడుమ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ఆలయ కమిటీ నాయకులు, రైతు సంఘ నాయకులు భక్తులకు సేవలందించారు. మంగళవారంతో ఉత్సవాలు ముగుస్తాయి.

21న పిఠాపురంలో జాబ్ మేళా



జాబ్‌మేళా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 21న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి దండెం హరిశేషు తెలిపారు. ఈ మేరకు జాబ్‌మేళా వాల్ పోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆవిష్కరించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరిశేషు మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో 12 కంపెనీలు పాల్గొంటాయన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, డిప్లమో, బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బీటెక్ వారికి ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. జీతం రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు ఉంటుందన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ విద్యార్హత, ఇతర సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 86889 77277, 90107 37998 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు కె.యశోదకృష్ణ, ప్లేస్‌మెంట్ అధికారి శ్యామ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రంలో పుష్కరిణి వద్ద సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. మృతుడి సుమారు 55 సంవత్సరాలు ఉంటుందని, మృతుడు ఎరుపు రంగు చొక్కా ధరించి గడ్డంతో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆ వ్యకి వివరాలు తెలిసిన వారు 94407 96523 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ కోరారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

కొత్తపల్లి: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ శ్రీనివాస్ తెలపారు. మండలంలోని వాకతిప్ప శివారు నాగులాపల్లి ఏరియా పరిసర గ్రామాల రక్షిత తాగునీటి పథకాన్ని సోమవారం అయన పరిశీలించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, కెనాల్ వాటర్, ఫిల్టర్ బెడ్, క్లియర్ వాటర్ సంపులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాలువల ద్వారా నీరు రాకపోవడం, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నీరు తక్కువగా ఉండటం వలన నీటి రంగు మారుతుందన్నారు. ఆయన వెంట డీఈఈ శ్రీదేవి, జెఈ సంధ్య ఉన్నారు.

శాకంబరీ నమోస్తుతే..



శాకంబరిగా దర్శనమిచ్చిన పిఠాపురం మహాలక్ష్మి అమ్మవారు

పిఠాపురం: ఆషాఢమాసలో చివరి రోజు, బహుళ అమావాస్యను పురస్కరించుకుని సోమవారం గ్రామాల్లోని అమ్మవార్లు శాకంబరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పిఠాపురంలోని మహాలక్ష్మి అమ్మవారు శాకంబరిగా దర్శనమివ్వగా వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామ దేవత వేగులమ్మ అమ్మవారికి వేద పండితులు కూరగాయలు, పండ్లతో శాకంబరి అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు చెరుకూరి దత్తు, వీరబాబు సౌభాగ్య స్త్రీలతో లలితా సహస్రనామ కుంకుమార్చన, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పంటలు పుష్కలంగా పండాలని, రైతన్న సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఏటా అమ్మవార్లకు శాకంబరి అలంకరణ చేస్తామని ఆలయ అర్చకులు తెలిపారు.



శాకంబరి అలంకారంలో దుర్గాడ వేగులమ్మవారు

వలంటీర్లకు వందనం

వలంటీర్ల సేవలు మరువలేం



గతంలో పథకాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే వాళ్లం. వలంటీర్ వ్యవస్థ వచ్చాక ఇంటికే పథకాలు అందుతున్నాయి. మా వలంటీర్ మీనాక్షి ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయాన్నే ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు ఇస్తుంది. ప్రభుత్వ పథకాలపై మాకు అవగాహన కల్పిస్తుంది. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ కరోనా వంటి కష్టకాలంలోనూ విలువైన సేవలు అందించిన సేవలు మరువలేం.

– బి.సూర్యమణి, లబ్ధిదారు, వాకతిప్ప

ఆరోగ్యశ్రీతో ఆదుకున్నారు

పెద్దాపురం మండలంలోని వాలుతిమ్మాపురం వలంటీర్ హిమామి ఆ కుటుంబానికి ఆరోగ్యశ్రీ ఇచ్చి అన్ని విధాలా ఆదుకున్నారు. గ్రామానికి చెందిన పితాని అర్జునరావు కుటుంబానికి ఆరోగ్యశ్రీ కార్డు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డారు. వలంటీర్ హిమామి కృషితో ఆ కార్డు వచ్చింది. ఓ పక్క ఎటువంటి సంక్షేమ పథకానికైనా సాంకేతిక లోపం తలెత్తినా అది పూర్తిచేసి లబ్ధిదారులకు మేలు చేకూరే వరకు ఆమె పడుతున్న కష్టాన్ని అందరూ అభినందిస్తున్నారు.



లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డును అందజేస్తున్న వలంటీర్ హిమామి

లబ్ధిదారుల ఇంటికే ప్రభుత్వ పథకాలు



పిఠాపురం ఇందిరా నగర్‌లో వృద్ధురాలికి పథకాలు వివరిసున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు



గడప గడపకూ మన ప్రభుత్వంలో ప్రజా సమస్యలు వింటున్న దవులూరి దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడప గడపకూ..

పిఠాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఇంటికే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం ఇందిరా నగర్‌లో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజలు సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా ? లేదా ? అని ఎమ్మెల్యే దొరబాబు ప్రజలను ఆరా తీశారు. గ్రామం వలంటీర్లు అన్ని పథకాలు ఇంటికే తెచ్చి ఇస్తున్నారంటూ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పథకాల కోసం గతంలో లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి గంటల తరబడి నిరీక్షించేవారన్నారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి ఎక్కడా లేదన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల సిఫార్సులు లేనిదే ఎవరికీ ఎటువంటి పథకం వచ్చేది కాదన్నారు. ఇప్పుడు అర్హత ఉంటే చాలు లబ్ధిదారుల ఇళ్లకే పథకాలు అందుతున్నాయన్నారు. ఇలాంటి పారదర్శక పాలన తన రాజకీయ జీవితంలో ఎప్పుడు చూడలేదని తెలిపారు. ఎవరికి ఏదీ రాలేదనే మాట లేకుండా అన్ని వర్గాలకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. తమ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికం తప్ప పైరవీలు, సిఫార్సులు ఎక్కడా ఉండవన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హత గల ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కౌన్సిలర్ పెదపాటి నాగేశ్వరరావు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పెద్దాపురం: ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. పట్టణంలోని నాలుగో సచివాలయం పరిధిలో 6, 7 వార్డుల్లో మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు, కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, కాపుగంటి సౌందర్య లక్ష్మి, సచివాలయ సిబ్బందితో కలసి గడపగడపను సందర్శించి లబ్ధిదారులు పొందుతున్న పథకాలపై ఆరా తీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, టీపీఓ ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు పాల్గొన్నారు.

గింజలు లేవు కంకులే వస్తున్నాయి

- జేకే 3502 రకం విత్తనాలపై రైతుల ఫిర్యాదు
- మొక్కజొన్న పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



తాటిపర్తిలో మొక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న అధికారులు

పిఠాపురం: తెగుళ్లను తట్టుకుని మంచి దిగుబడి వస్తుందని వ్యాపారులు చెప్పిన మాటలు నమ్మి జేకే 3502 రకం విత్తనాలు సాగు చేస్తే గింజలు లేకుండా కంకులే వస్తున్నాయని మొక్కజొన్న రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తల బృందం గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో మొక్క జొన్న తోటలను పరిశీలించింది. ఫిర్యాదు చేసిన రైతుల పొలాల్లో పంటలను పరిశీలించిన అధికారులు విత్తనం వేసిన నాటి నుంచి ఏయే ఎరువులు వాడారు, పురుగు మందులు ఏమి ఉపయోగించారు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. పంట ఏపుగా పెరిగినా గింజలు రాకుండా కంకులే ఎందుకు వస్తున్నాయనే విషయంపై శాస్త్రవేత్తలు శాంపిల్స్ సేకరించారు. దీనిపై పూర్తిగా విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు రైతులకు తెలిపారు. కార్యక్రమంలో పిఠాపురం ఏడీఏ పి.స్వాతి, వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పి.మునిరత్నం, ఐ.సుధీర్ కుమార్, గొల్లప్రోలు మండల వ్యవసాయశాఖాధికారి కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు, ప్రజల మధ్య సత్సంబంధాలు ఉండాలి

డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి



వారధి కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి

పిఠాపురం: పోలీసులు, ప్రజల మధ్య సత్సంబంధాలు ఉండాలని కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో సోమవారం రాత్రి వారధి కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రజలే నియంత్రించాలన్నారు. ప్రజలకు పోలీసులు ద్వారా అందే సేవలను వివరించారు. వారధి కార్యక్రమం ద్వారా గ్రామాల్లో శాంతి నెలకొంటుందన్నారు. చిన్న చిన్న సమస్యలను మాట్లాడుకుంటే పరిష్కారమవుతాయని, పొరుషాలకు పోయి వాటిని పెద్దవి చేసుకుని ఇబ్బందులు పడవద్దని ప్రజలకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఆయన గొల్లప్రోలు పోలీసు స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై వినయ్‌ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేసిన బాంబ్ స్క్వాడ్

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో కాకినాడకు చెందిన బాంబ్ స్క్వాడ్ సోమవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. దీనిలో భాగంగా రైల్వే స్టేషన్ ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం పైకి వచ్చిన రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌లోని బోగీలను తనిఖీలు చేశారు. రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ మాట్లాడుతూ ప్రయాణికులను అప్రమత్తం చేయడానికి మాక్ డ్రిల్ దోహద పడుతుందన్నారు. అనుమతి లేని సరకులను ప్రయాణికులు తీసుకువెళితే గుర్తించడానికి ఈ తనఖీల ద్వారా వీలు కలుగుతుందని చెప్పారు. బాంబ్ స్క్వాడ్ అధికారి ఏవీవీఎస్ వర్మ ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్ రామకృష్ణ, జీఆర్పీ ఎస్సై బి.లోవరాజు, స్టేషన్ మేనేజరు ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.